'రచన' మాసపత్రిక – ఫిబ్రవరి, 2006

# బంధం

రమణయ్య వాలుకుర్చీలో కూర్చున్నాడు. అతడి చేతిలో చుట్ట వుంది. అది ఆరిపోయి వుందని గమనించే స్థితిలో లేడు.

సుందరమ్మ అంత్యక్రియలు జరిగిపోయేయి. దశాహం కూడా ముగిసింది. ఇక బంధుజనం ఒకరూ ఒకరూ ఎవరి ఇళ్ళకి వాళ్ళు వెళ్ళిపోయే హడావుడి.

ఈ లోగా రమణయ్య విషయం తేలాలి కదా. ఎక్కడుంటాడు? ఎవరి వద్ద వుంటాడు?

బంధువుల ఉత్కంఠకి తెర దించేడు ప్రకాష్.

"నాన్నని నాతోబాటు వైజాగ్ తీసుకువెళిపోతాను" – తెలియజేశాడు ప్రకాష్.

అందరూ హర్షించేరు. రమణయ్య కొడుకు వద్ద వుండడం ధర్మంగా భావించేరు. ప్రకాష్ వైజాగ్‌లో ఒక ప్రభుత్వ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సొంత ఇల్లు. భార్య, పిల్లలతో హాయిగా సాగుతోంది తన జీవితం. తండ్రిని తీసుకెళ్ళడానికి అతని కెటువంటి ఇబ్బందులూ లేవు.

కానీ రమణయ్యే ఇబ్బంది ఫీలయ్యేడు.

"నేను ఇక్కడే వుంటాను" అన్నాడు రమణయ్య.

ప్రకాష్ విస్తుపోయేడు. బంధువర్గం తెల్లబోయేరు.

పెద్దాయన. అలా అంటే ఎట్లా? ఒక్కడే ఈ కొంపలో ఎలా వుంటాడు? ఇదేదో తాతల కాలం నుంచి అలవాటుపడిపోయి వదలబుద్ధి కాని సొంత కొంప కాదు. కేవలం అద్దెకుంటున్న ఇల్లు. ఆయన వయసు చూస్తే డెబ్బయి సంవత్సరాలు. పైగా మధుమేహం కూడా తనకి వుంది. ఎలా వుంటాడు ఒక్కడు?

ఆర్థికంగా తను ఏ ఒక్కరిపై ఆధారపడే స్థితిలో లేనప్పటికీ ముసలాయన ఒక్కడూ ఎలా వుంటాడు?

"మీరంతా వుండగా నేనెలా ఒంటరిని?" అంటాడు రమణయ్య.

తమదేమీ అవిభక్త కుటుంబం కాదు. ఉమ్మడి కుటుంబం కాదు. ఎవరి బతుకులు వాళ్ళవి. ఎవరి సంసారాలు వాళ్లవి. అయినప్పటికీ –

రమణయ్యకి అందరూ కావాలి.

అతని తండ్రి అనారోగ్యంతో అకాల మరణం చెందినప్పుడు ... పెద్దకొడుకుగా ఇంటి బాధ్యతంతా తనపై పడింది. అది తన ధర్మంగా భావించి బాధ్యతలు తీసుకున్నాడు. ఇద్దరు తమ్ముళ్ళ చదువు, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు జరిపించేడు. అలాగే ముగ్గురు చెల్లెళ్ళకూ మంచి

సంబంధాలు చూసి పెళ్ళిళ్ళు చేశాడు.

రమణయ్య తల్లి అన్నపూర్ణమ్మ పక్షవాతంతో మూడేళ్ళకు పైగా బాధపడింది. ఆమెకు అన్ని సపర్యలు మంచంపైనే విసుక్కోకుండా సుందరమ్మ చేసేది. అత్తకు సేవ చేయడమే కాదు ఆడపడుచులను తన సొంత కూతుళ్ళలా చూసుకొని అందరికీ పురుళ్ళు పోసింది కూడా.

ఉదయం నాలుగ్గంటలకు లేచే సుందరమ్మకు రాత్రి పదీ పదకుండు గంటల వరకూ తీరికలేని పని. రోజూ వచ్చీపోయే బంధుజనంకి మంచీ మర్యాద, వంటావార్పుతోనే ఆమెకు సరిపోయేది.

రమణయ్య అందరికీ చేయగలిగింది చేశాడు. కాని సుందరమ్మకు ఏమి చేశాడు? ఏమీ చేయలేదనే స్పృహ.. ఆమె తనని వదిలివెళ్ళిపోయేక అతనిలో రగిలింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి.

ఇంతకాలం రమణయ్యను సుందరమ్మ చూసుకుంది. ఇపుడెవరు చూసుకుంటారు?

కొడుకు ప్రకాష్ రమణయ్యను చూసుకోవడానికి ముందుకొచ్చేడు.

'నేనెక్కడికీ వెళ్ళను. ఇక్కడే వుంటాను' అని స్పష్టం చేశాడు రమణయ్య.

అతడికి ఆత్మాభిమానం. అలాగే పిల్లలు పట్ల ఎనలేని అభిమానం.

కొడుకూ, కోడలూ మంచివాళ్ళే. వాళ్ళనెందుకు తను ఇబ్బంది పెట్టాలి? తను ఆరోగ్యం గానే వున్నాడు. తన వంట తను చేసుకోగలడు. తన బట్టలు తను ఉతుక్కోగలడు. వీటన్నిటికన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే తను ఇక్కడే వుంటే ఎప్పటిలానే పిల్లలూ, బంధువులూ అంతా వచ్చీ పోతుంటారనీ, మునుపటిలానే ఇల్లు కళకళలాడుతూ కలివిడిగా వుంటుందని రమణయ్య తాపత్రయం.

రమణయ్య ఇక్కడే వుంటాను అనడంతో –

అమ్మాజి లేచి నుంచుంది.

"నాన్న ఇక్కడే వుంటానంటున్నారు గనుక – వుండనీయండి. నాన్నకేమీ ఫర్వాలేదు. నేను దగ్గరుండి చూసుకుంటాను" అన్నది.

అమ్మాజి రమణయ్య చిన్నకూతురు.

ప్రకాష్ ఏమీ అనలేదు. బంధుజనంకి ఈ ప్రపోజల్ కూడా బాగానే వున్నట్టనిపించింది.

అమ్మాజీ తండ్రి వున్న పేటకి దగ్గర్లోనే వుంటోంది.

మొన్నమొన్నటి వరకూ ఆమె తల్లిదండ్రులతోనే వుండేది. గత ఏడాది వివాహం అయ్యేక భర్తతో యస్.ఆర్.నగర్‌లో వుంటోంది.

తలిదండ్రులతో ఆమెకున్నంత అటాచ్‌మెంట్ మిగతా బిడ్డలకి లేదనే విషయం బంధువులందరికీ తెలుసు.

రమణయ్యకి సంతానం అయిదుగురు. పసివయసులోనే ఇద్దరు మృత్యువాత పడగా

ముగ్గురు మిగిలేరు. కొడుకు ప్రకాష్ పెద్దవాడు. ఇద్దరు కూతుళ్ళు. పెద్దకూతురు లలిత ప్రకాష్ కన్నా రెండేళ్ళు చిన్నది. అమ్మాజి మాత్రం లలిత పుట్టిన పదేళ్ళకి పుట్టింది. అంచేత అమ్మాజి అంటే తల్లిదండ్రులకే కాదు అందరికీ ప్రేమే!

లలితకు పద్దెనిమిదేళ్ళు నిండకముందే పెళ్ళి అయింది. అమ్మాజికి వయసు ఇరవయ్యారు దాటేక గాని జరగలేదు వివాహం. శ్రీమతి కాకముందే తను ఉద్యోగస్తురాలు.

రమణయ్య రిటైర్ అయ్యేక కూడా ఇంచుమించు తొమ్మిది సంవత్సరాల వరకూ అమ్మాజీ తల్లిదండ్రులతోనే వుంది! రిటైరయిన తండ్రికి ఆమె మరింత దగ్గరయింది. మధుమేహం వున్న తండ్రికి తను గుర్తు చేసి మాత్రలు ఇవ్వడమే కాదు, చుట్టలు కూడా తనే కొని తెచ్చి తన చేతులతోనే వెలిగించేది. చివరికి తనకు అవసరమైనవి సుందరమ్మని కాకుండా అమ్మాజీనే పిలిచి చేయించుకోవడం అలవాటుగా మారింది రమణయ్యకి.

పెన్షన్ కోసం బ్యాంక్‌కి రమణయ్య వెళ్ళేటప్పుడు, హుషారుగా అమ్మాజి కూడా వెంటబడేది. పెన్షన్ తీసుకొని ఇంటిముఖం పట్టేటప్పుడు అమ్మాజికి తను ఇష్టమైన స్వీటు ఒక అరకేజీ కొని ఇచ్చేవాడు. ఆమె లడ్డూ, జిలేబీ, కోవా, రసగుల్లా లాంటి స్వీట్లు ఇష్టపడేది కాదు. అరిసెలు కావాలని మారాం చేసి కొనిపించుకు తినేది.

అమ్మాజి ఉద్యోగంలో చేరేక పెన్షన్ తీసుకోవడానికి తనతో ఆమె రావడం మానేసినా ఆమె వాటా అరిసెలు తేవడం మాత్రం మర్చిపోయేవాడు కాదు. చివరికి అమ్మాజీ వివాహమై యస్.ఆర్.నగర్‌కి వెళ్ళిపోయినా ప్రతి నెలా ఆమె ఇంటికి వెళ్ళి అరిసెలు అందజేస్తూనే వున్నాడు ఇప్పటికీ.

ఆదివారం వచ్చినా, సెలవు దినం వచ్చినా పుట్టింటికే పరుగున వచ్చేసేది అమ్మాజి. ఆమె భర్త సూర్యం బుద్ధిమంతుడు. ఆమెకు పూర్తిగా సహకరించే మనిషి. ఒక ప్రభుత్వ రంగ సంస్థలో ఇంజనీరుగా ఉద్యోగం చేస్తున్నాడు.

'నాన్నని నేను చూసుకుంటాను' అని ఉద్వేగంతో అమ్మాజి అందరి ముందు అన్నప్పుడు సూర్యం ఆమె పక్కనే వున్నాడు. ఆ విషయం ముందుగా తనతో డిస్కస్ చేయకుండా కనీసం చిన్నమాటైనా చెవిలో వేయకుండా.. ఆమె ఆ విధంగా ప్రకటించినందుకు అతడేమీ ఫీల్ కాలేదు. అతనికప్పుడు తండ్రి ఎడల ఆమె ప్రేమానురాగాలే కన్పించేయి.

తండ్రి అంటే ఆమెకు ప్రాణమని తెలుసు. మావయ్యగారంటే తనకీ ఇష్టమే. అసలు ఆయనంటే ఇష్టం లేనివారు ఎవరున్నారు గనుక! అందరికీ ఇష్టుడే ఆయన.

'నాన్నని నేను చూసుకుంటాను' అన్న ఆమె మాటలు తను వయసులో అందరికన్నా చిన్నదే అయినప్పటికీ అవి శిలాక్షరాలు అయిపోయేయి అక్కడ.

అందరూ 'అలాగేనమ్మా సంతోషం' అన్నారు.

"అమ్మ వున్నప్పుడు మీరంతా ఈ యింటికి ఎలా వచ్చి వెళ్ళేవారో, ఇప్పుడు కూడా అదేవిధంగా మీరంతా వచ్చి వెళ్తుండమని నేను వేడుకుంటున్నాను. మీకు తెలుసుకదా.

నాన్నకి అందరూ కావాలి. నాన్న అన్నయ్యతో వెళ్లననడానికి కారణం అదే అనుకుంటున్నాను. అంచేత మీరంతా దయచేసి వీలైనప్పుడల్లా వస్తూ నాన్నని సంతోషపర్చమని కోరుకుంటున్నాను" అంటూ వినయంగా ముకుళిత హస్తాలతో బంధువర్గాన్ని ప్రార్థించింది అమ్మాజి. ఆ తర్వాత తండ్రి వద్దకు వెళ్ళి వంగి కాళ్లకు నమస్కరించింది.

'అయ్యో! చుట్ట ఆరిపోయింది నాన్నా!' అని అగ్గిపెట్టెని తీసి తన చేతులతో చుట్టని వెలిగించింది.

ఒక్కసారిగా చుట్టపొగ పీల్చిన రమణయ్యకి ఏదో శక్తి వచ్చినట్లయింది. అతనిలో సుదృఢమైన హృదయశాంతి నెలకొని కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. అమ్మాజి తల్లడిల్లిపోయి తన పమిట చెంగుతో కన్నీళ్ళను తుడిచింది.

అమ్మాజి నిష్కల్మషంగా మాటాడి ప్రవర్తించిన తీరు, ఆమె హావభావాలు, కన్నుల తళుకు, ముక్కు సోయగం, చెక్కిళ్ళ మెరుపు చూసి థ్రిల్ అయ్యేడు సూర్యం. ఆమెలో నున్న సంస్కారం ఆమె ముఖారవిందాన్ని అమిత తేజస్సుతో ప్రకాశింపచేసిందని భావించేడు. ఆ రోజు అమ్మాజి అతనికి ఎప్పుడూ లేనంత అందంగా, అద్భుతంగా కనిపించింది.

❁ ❁ ❁

అమ్మాజి ఇల్లు ఖాళీ చేసేసి చెంబూ చేటతో సహా పూర్తిగా తండ్రి ఇంటికి మకాం మార్చేసింది. అప్పటికే ఆమె కడుపుతో వుంది.

నెలలు సాగేక.. ఒక రోజున పండంటి బిడ్డను కన్నది అమ్మాజి. ఆడపిల్ల!

పుట్టిన బిడ్డను రమణయ్య చేతిలో పెట్టి – "ఈ బంగారు తల్లి ఎవరో కాదు నాన్నా! అమ్మ! అమ్మ మనల్ని వదలి వుండలేకే నీ మనవరాలి రూపంలో మళ్ళీ మన మధ్యకు వచ్చేసింది" అన్నది మెరిసే కళ్ళతో అమ్మాజి.

బిడ్డకు తల్లి పేరే పెట్టింది. రేపు చదువుల కోసం త్రిపురసుందరి. కాని ఇంట్లో పిలిచేది సుందరమ్మనే. అమ్మాజీ తన మెటర్నటీ లీవు అయిపోగానే పాపని ధైర్యంగా తండ్రి చేతిలో పెట్టేసి ఆఫీసుకి వెళ్ళగలిగింది. క్రెచ్ అందుబాటులో వున్నా అక్కడ పాపను తన తండ్రి చూసుకొనే రీతిలో అంత చక్కగా చూసుకుంటారనే నమ్మకం ఆమెకు లేదు.

పిల్లల మానసిక ఎదుగుదల చైల్డ్‌కేర్ సెంటర్‌లో కన్నా ఇంటి వాతావరణంలోనే సక్రమంగా వుంటుందనే అమ్మాజీ నమ్మకాన్ని రమణయ్య వమ్ము చేయలేదు. సుందరమ్మ ఆరోగ్యంగా, బొద్దుగా ముద్దొచ్చేలా తయారయింది.

మరో రెండేళ్ళు పోయేక మరో బిడ్డను కని తండ్రి చేతిలో పెట్టింది. మగబిడ్డ. పేరు సందీప్!

'ఇదేమిటి తల్లీ! నీవు నన్ను బిడ్డలా చూసుకోవాల్సింది పోయి – నీ పిల్లల్ని నేను పెంచడం ఏమిటి? ఈ వయసులో నాకిది సాధ్యమా' అని అనలేదు రమణయ్య. అంతేకాదు ఏనాడూ కూతురిపై అసహనం, కోపం, చిరాకు ప్రదర్శించలేదు తను.

పసిపిల్లలు ఇద్దరూ తనని కబాడీ ఆడించేస్తూ యమ యాతన పెట్టేస్తున్నా వాళ్ళకి ఏ లోటు రాకుండా అపురూపంగా ప్రేమతో, ఓరిమితో చూసుకోగలిగేడు రమణయ్య.

"పిల్లలిద్దర్నీ చూసుకోవడం మీ నాన్నకి ఇబ్బంది కదా. ఒక పనిపిల్లని తోడు వుంచితే బాగుంటుందేమో" అన్నాడు సూర్యం.

"నా కిష్టం లేదు. పనిపిల్లలు దగ్గర శుభ్రత ఉండదు. మా నాన్న పిల్లల్ని చక్కగా చూసుకుంటున్నారు. ఆయనకు ఎటువంటి ఇబ్బంది లేదు. ఎందుకో మీరు మాత్రం అనవసరంగా ఇబ్బంది పడిపోతున్నారు" అంది నవ్వుతూ అమ్మాజి.

ఆమె ముఖంలో నవ్వు ఈసారి అతనికి అందంగా కనిపించలేదు.

❁ ❁ ❁

చెల్లెలు తండ్రిని చూస్తున్న తీరు నచ్చలేదు లలితకు. ఆమెకు చాలా కోపంగా వుంది. తండ్రిని చూడటానికి వెళ్ళేటప్పుడు చెల్లెల్ని గట్టిగా అడగాలనుకుంది. అడగడానికైనా తండ్రిని చూడటానికి వెళ్ళాలనుకుంది. కాని ఆమెకు వీలుపడడం లేదు. ఇంట్లో ఆమెకు క్షణం తీరిక వుండడం లేదు. భర్తకీ, పిల్లలకీ ఎటువంటి ఇబ్బంది కలిగించడం ఆమెకు ఇష్టం వుండదు. అందుకే తండ్రి వద్దకు వెళ్ళలేకపోయింది.

చెల్లెల్ని చెడామడా తిట్టి తండ్రిని ఆయా డ్యూటీ నుంచి విముక్తుడిని చేయాలని వుంది. ఒక రోజు వుండబట్టలేక ఫోన్ వద్దకు వెళ్ళి అమ్మాజికి రింగ్ చేసింది.

ముందుగా, పొడిపొడిగా క్షేమ సమాచారాలు మర్యాదకు కానించి అసలు విషయంలోకి దిగిపోయింది– "చెల్లీ! పిల్లల్ని మీ ఆఫీస్ దగ్గర్లోనున్న కేర్ సెంటర్‌లో పెడితే బాగుంటుంది కదా! నాన్న ఆ వయసులో పసిపిల్లల్ని ఏమి చూసుకోగలడు చెప్పు?"

"అక్కా! నాకు కేర్ సెంటర్లు నచ్చవు. నా పిల్లల్ని ఎలా పెంచాలో నాకు తెలియదా? నాన్న పిల్లల్ని బాగానే చూసుకుంటున్నాడు. అయినా నీవెందుకలా అడుగుతున్నావ్? ఇబ్బందిగా వుందని నాన్న నీకేమైనా చెప్పాడా అక్కా?"

"నాన్నేమీ నాకు చెప్పలేదు. నాకే కష్టమనిపించి అడుగుతున్నాను."

"ఆయనకి లేని కష్టం నీకెందుకు? ఇదేం బాగాలేదక్కా! నీ పిల్లల పసితనం రోజుల్లోకి ఒకసారి వెళ్ళు. నీవు పుట్టింట్లో కనేసిన పిల్లలిద్దర్నీ అమ్మా, నాన్నే చూసుకున్నారు కదా! నీ పిల్లలు స్కూలుకెళ్ళే వయసు వచ్చేవరకూ అమ్మా నాన్న దగ్గరే వుంచేశావు. అవునా? నేను నీ పిల్లల్ని నా భుజాలు పడిపోయేలా ఎత్తుకొని ఆడించేను. అల్లారుముద్దుగా పెంచేను. నీకా విశ్వాసం వుంటే.. ఈ రోజు నీవిలా మాటాడవు అక్కా."

"నీవు అనవసరంగా అర్థం లేని విషయాలు మాటాడుతున్నావ్. వృద్ధాప్యంలో తండ్రిని నీవు చూస్తున్న తీరు బాగోలేదని నేనంటే నీవేమో గతం గెలికి నా పిల్లల దగ్గరకెళ్ళి పోతున్నావ్. దానికి, దీనికి ఏమిటి సంబంధం? మలమూత్రాలు విసర్జించిన గుడ్డలు మార్చడం, ముడ్లు కడగడం లాంటి పనులు నాన్న నా పిల్లలకు చేయలేదు. నీకు, నాకు, అన్నయ్యకి కూడా

ఆయన చేయలేదు. చేయాల్సిన ఖర్మ ఆయనకి లేదు. ఒక గవర్నమెంటు ఆఫీసర్‌గా గౌరవంగా రిటైరయిన తండ్రి చేత - అదీ ముసలి వయసులో - ఇలాంటి పాకీ పనులు చేయించడం ఏమైనా బాగుందా?"

"నాకు బాగుంది. నా పిల్లలకి బాగుంది. నాన్నకి కూడా బాగుంది. నీకు బాగోలేకపోతే నేనేం చేయలేను అక్కా. నీవలా అక్కడ నొప్పులు పడిపోయే బదులు నీ విక్కడికి వచ్చి నాన్నకి సాయం చేయి. నాకు అభ్యంతరం లేదు" అని టక్కమని ఫోన్ పెట్టేసింది అమ్మాజి.

లలితకి ఒళ్ళు మండిపోయింది. అక్కడే కామ్‌గా పేపరు చదువుతున్న శంకర్రావుతో "చూసేరా మా చెల్లి పొగరు" అంటూ కోపంతో ఊగిపోతూ ఇదంతా తను ముందుగానే ఊహించినట్లు తెలియజేసింది. పేపర్లోంచి తల ఎత్తలేదు శంకర్రావు.

"నాకు తెలుసు. అది ఆ రోజు నంగనాచిలా నాన్నని నేను చూసుకుంటాను అని అన్నప్పుడే దాని అంతర్యం గ్రహించాను. అది ఒక పథకం ప్రకారం తండ్రిని పడేసుకుంది. మీకు తెలుసా! ఆయన తినే పిడికెడు మెతుకులకి ఒక పేయింగ్ గెస్టులా నెలకు దానికి నాలుగు వేలు ఇస్తాడు. ఆయన అక్కడితో వూరుకోడు. తన జేబులో డబ్బుల్తోనే మార్కెట్‌కి వెళ్ళి కూరగాయలు తెస్తాడు. అడ్డమైన దానికీ తన జేబులోంచే పైసలు తీసి ఖర్చుపెడతాడు. మందులకీ, మాకులకీ ఎలానూ అతని డబ్బులే. ఆ వ్యవహారం అలా వుంచండి. నా బాధంతా ఏమిటంటే వృద్ధుడైన తండ్రి చేత రోజంతా పిల్లలకి చాకిరీ చేయిస్తుందా? అది నేను అడగడం తప్పా?" అన్నది లలిత. ఆమెకు కళ్ళంట నీళ్ళు వచ్చేస్తున్నాయ్.

"నీ బాధని అర్థం చేసుకోవలసిన అవసరం మీ చెల్లెలికి లేదు. కావలిస్తే నిన్నే అక్కడికెళ్ళి మీ నాన్నకి సేవ చేసుకోవడానికి నీకు పర్మిషన్ ఇచ్చింది. నీవు వెళ్ళగలవా? వెళ్ళలేవు. ఆ సంగతి నీ చెల్లెలికి తెలుసు. అయితే మీ చెల్లెలికి చెప్పు దెబ్బ కొట్టినట్టు నీవొక పని చేయచ్చు."

"ఏమిటో చెప్పండి" అంది లలిత.

"మీ నాన్నని నీవు మనింటికి తీసుకొచ్చేసి పువ్వుల్లో పెట్టి పూజించు. అది బెస్టు. ఏమంటావ్?" అన్నాడు శంకర్రావు పేపర్లోంచి తల ఎత్తకుండానే.

"సర్లెండి. మీ సలహా బాగుంది గాని అది అయ్యే పని కాదు. మా అన్నయ్య దగ్గరకే వెళ్ళనన్న మనిషి మన దగ్గరకేమి వస్తాడు? ఆయన ఖర్మ! చివరి రోజులు దాని దగ్గర పడి వుండమని రాసేడు దేవుడు. ఏం చేస్తాం?" రెండు కన్నీటిబొట్లు రాల్చి, ముక్కు ఎగ బీలుస్తూ నెమ్మదిగా వంటగదిలోకి వెళ్ళిపోయింది లలిత.

నవ్వుకున్నాడు శంకర్రావు.

అతడు ఏలూరు ఆర్ట్స్ కాలేజీలో లెక్చరర్. ఇద్దరు మగపిల్లలు. పెద్దవాడు ఎమ్‌సెట్ యుద్ధంలో ర్యాంక్ సంపాదించి ఇంజనీరింగ్‌లో జాయిన్ అయ్యేడు. పేమెంట్ సీట్. రెండోవాడు టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాస్తున్నాడు.

శంకర్రావుకి ఒక తమ్ముడున్నాడు. తల్లి కూడా వుంది. తమ్ముడు వ్యవసాయం చేస్తున్నాడు. అతడికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు. నాలుగెకరాల భూమి. ప్రతి ఏడూ తనకి బియ్యం పంపిస్తుంటాడు. పంపిస్తున్న బియ్యంతో తృప్తి చెందదు లలిత. ఆ భూమిలో వాటా అడిగి తీసుకోమంటుంది. అందుకు తను ఏమాత్రం సిద్ధంగా లేడు. వర్షాధార భూములు. తమ్ముడు ఎలాగో నెట్టుకొస్తున్నాడు. ముఖ్యంగా తల్లిని చూస్తున్నాడు.

మరో కోణం నుంచి చూస్తే 'పాపం లలిత' అనిపిస్తుంది శంకర్రావుకి. నెలనెలా ఇల్లు గడవడం టైట్‌గా వుంటోంది. ఈ మధ్య బేంక్ లోన్‌తో ఇల్లు కట్టుకున్నారు. ఒక పక్క పిల్లల చదువుల ఖర్చులు.. ఇంకా ఏవేవో ఆర్థిక ఇబ్బందులున్నమాట వాస్తవం. ఆ స్థితిలో లలిత బాలెన్స్‌డ్‌గా సంసారం లాక్కొస్తోంది. ఇంటిని మేనేజ్ చేయగలగడం ఆమెకు మాత్రమే సాధ్యం అని భర్తగా గర్విస్తాడు తను.

అయితే ఎవరైనా చుట్టాలు వచ్చి రెండు రోజులుంటే చాలు ఆమెలో అసహనం అతనికి చికాకు కలిగిస్తుంది. ఆమె గిరిగీసుకున్నదే ప్రపంచం. మరొకరు కాలు పెట్టడానికి వీలులేదు. తమ్ముడి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే గనుక వాడి ముగ్గురి కూతుళ్ళలో ఒకదాన్ని మూడేళ్ళ వయసులోనే తీసుకొచ్చి పెంచుకుందామనుకున్నాడు. అబ్బే! ఒప్పుకోలేదు లలిత. అతని తల్లి కూడా ఆ ఇంటికొచ్చి రెండు రోజులుండడానికి ఉత్సాహం చూపదు.

తనకు లలిత ధోరణి నచ్చనిది అక్కడే.

"మనకి ఏవేవో ఇబ్బందులుండొచ్చుగాక. అంతమాత్రాన కావాల్సిన వాళ్ళని కాదనుకొని, ప్రేమానుబంధాలకి దూరంగా మనకు మనమే ఇటుకలు పేర్చేసుకుని సమాధి కట్టేసుకుంటే ఎట్లా?" అనే శంకర్రావు మాటలు ఆమె తల కెక్కవు. ఆమె భయాలు ఆమెవి.

❁ ❁ ❁

అమ్మాజికి రోజూ ఉదయం లేవగానే ఎక్కడలేని హడావుడి. పరుగులే పరుగులు. పిల్లలకి స్నానాలు, పానాలు, మరోవైపు వంట చేయడం, తనకూ, సూర్యంకి కారియర్ కట్టడం, పిల్లలకి వేరుగా వుడకేసిన ఆహారం, పాలు - తండ్రికి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయడం - ఆదరా బాదరాగ ఆఫీసుకి తొమ్మిది గంటలకు చేరడం.... తిరిగి సాయంత్రం ఏ ఆరేడు గంటలకో ఇంటికి చేరడం! సూర్యం అయితే ఉదయం ఎనిమిది గంటలకు వెళ్ళిపోయి... రాత్రి ఏ టైముకి ఇంటికి చేరుకుంటాడో అతనికే తెలియదు!

ఏమి ఉద్యోగాలో ఏమిటో - అని రమణయ్యలో ఆందోళన. రోజులు చూస్తే బాగోలేవు. కూతురు, అల్లుడు రావాల్సిన టైముకి ఇంటికి రాకుంటే అతనిలో టెన్షను. ఇంటికి రావడం ఆలస్యమవుతుందని కనీసం ఫోన్ అయినా చేసి చెప్పవచ్చు కదా!

"అది అయ్యే పని కాదు నాన్నా!" అనేస్తుంది అమ్మాజి చిరాగ్గా - "ఒక్కొక్కసారి ఆలస్యమవుతుంది. మీరెందుకు కంగారుపడడం? మా ఉద్యోగాలు అలాంటివి. ఈ వూళ్ళో ట్రాఫిక్ అలాంటిది. ఏదో సమయానికి ఇంటికి వచ్చేస్తున్నాం కదా. ఎందుకు మీకు టెన్షన్!

ఉదయం వదిలేసిన పిల్లల్ని.. సాయంత్రం ఎంత వేగిరం కొంపకి చేరి వాళ్ళని దగ్గరకు తీసుకొని ముద్దులాడాలని ఏ తల్లికి వుండదు? అర్థం చేసుకోండి."

రమణయ్య బాగానే అర్థం చేసుకొని నిర్లిప్తంగా వుండడం అలవర్చుకున్నాడు కొన్నాళ్ళకు.

అమ్మాజికి ఆదివారం కొంత రిలీఫ్! ఇల్లు శుభ్రంగా సర్దుకుని, మాసిన బట్టలు ఉతుకుడు కార్యక్రమం సూర్యం సాయంతో కానిస్తుంది. మధ్యాహ్నం పిల్లలు కాసేపు తనని నిద్రపోనిస్తే సంతోషం! ఆ సాయంత్రం స్కూటర్‌పై సూర్యంతో సినిమాకో, గుడికో వెళ్తుంది.

తను సరదాగా బయటకు వెళ్లేటప్పుడు పిల్లల్ని తండ్రి వద్దే వదిలేస్తుంది అమ్మాజి. లేకుంటే వాళ్లు అల్లరితో నరకం చూపిస్తారు. చాలాసార్లు అనుభవమయ్యేక పిల్లలని తీసుకెళ్ళడం మానుకుంది. కన్నతల్లి పిల్లల అల్లరి భరించలేకపోతోంది! మరి రోజూ రమణయ్య ఒక్కడూ ఈ పిడుగులతో ఎలా వేగుకొస్తున్నాడు? తాతయ్య తమని తిట్టినట్టుగాని, కొట్టినట్టుగాని ఏనాడూ తల్లికి రిపోర్టు చేయలేదు పిల్లలు. అంతేకాదు అమ్మాజి కోపంతో పిల్లలని కొట్టినా ఒప్పుకునేవాడు కాదు రమణయ్య.

ప్రతి రోజు సాయంత్రం మిత్రులతో వాకింగ్‌కి వెళ్ళి పార్కులో కూర్చొని గడిపే అలవాటు వుండేది రమణయ్యకి. ఇపుడాయన ప్రపంచమంతా ఆ యిద్దరు పిల్లలే. వాళ్ళే తన మిత్రులై ప్రాణమై సాగిపోతున్న రోజులు. తాతయ్య చెంత నుంటే అమ్మా, నాన్న అక్కరలేదు పిల్లలకి.

పిల్లల మానసిక ఎదుగుదలకి ఇల్లుని మించిన పాఠశాల లేదనీ, తాతను మించిన ఉపాధ్యాయుడు లేడనీ నిరూపించేడు రమణయ్య. పిల్లలను ప్రేమగా దగ్గరకు తీసుకొని మంచి మంచి కథలు చెప్పేవాడు. ఆ కథల్లో సాహసం, శౌర్యం కరుణ, మంచీ, చెడు, నీతి వుండేవి. కొత్త విషయాలు తెల్సుకోవాలనే జిజ్ఞాస, పాజిటివ్‌గా ప్రశ్నించగల తత్వాన్ని పిల్లలకి కలగజేసే యత్నం చేశాడు. ముద్దిస్తూ, మంచి మాటలతో పుస్తకం వద్ద కూర్చోబెట్టి చదువులో టాప్‌ర్యాంక్‌లో వుండేలా వాళ్లను తీర్చిదిద్దేడు.

ఇదంతా చూసి ఏ తల్లిదండ్రులకు ఆనందం కలగదు?

"మీ నాన్నకి మనం చాలా రుణపడి వున్నాం. అవునా?" అన్నాడు సూర్యం.

అవునూ, కాదు అనకుండా అమ్మాజీ ఇంకేదో మాటాడింది!

"మీకు తెల్సో లేదో మా అక్కయ్య, అన్నయ్యే కాదు దిక్కుమాలిన బంధుజనమంతా నాపై మండిపడి ఏడుస్తున్నారు. ఒక పథకం ప్రకారం మా నాన్నతో చాకిరీ చేయిస్తున్నానని ఒకటే గుసగుసలాడిపోతున్నారట! ఇలాంటి కుళ్ళు మనుషులకి నాన్న సాయం చేయడం చూస్తుంటే నాకు ఒళ్లు మండిపోతుంది."

సూర్యం చిత్రంగా ఆమె వైపు చూసేడు.

ఆయన సాయం చేస్తే ఈమె కెందుకు మంట? ఎవరైన ఇబ్బందుల్లో వుంటే ఆయనలో పరోపకారచింతన జాగృతమవడం తప్పంటే ఎట్లా? ఈ రోజుకీ ఆయన తన బంధువులందరికీ వారం వారం ఉత్తరాలు రాస్తూనే వుంటాడు. అటు నుంచీ ఉత్తరాలు వస్తాయి. డబ్బులు

వాళ్ళకి పంపితే ఒప్పుకోదు అమ్మాజి. ఆమెకు తెలీకుండా మనియార్డర్లు చేస్తాడు.

అప్పుల ప్రేమలో విరిసే కుసుమరేఖల పరిమళాన్ని అతను ఆస్వాదించి పారవశ్యం చెందితే ఈవిడ కెందుకు బాధ? ఆమెను ఏనాడూ ఒక్క రూపాయి కూడా అడగలేదే – తను ఇవ్వడం తప్పా.

ఆ యిల్లు రమణయ్య ఇల్లుగా కాక అమ్మాజి ఇల్లుగా రూపాంతరం చెందడంతో చాలావరకు బంధువుల రాకపోకలు తగ్గిపోయిన వైనం గమనించేడు సూర్యం.

ప్రతి సంవత్సరమూ రమణయ్య సంక్రాంతి పండగకి కూతుళ్లిద్దరికీ చెరో అయిదు వందలు ఇస్తాడు. ఇప్పటికీ ఇస్తున్నాడు. ఏ కూతురూ కాదనకుండా తీసుకోవడం జరుగుతోంది. ఆయన కూతుళ్ళకేకాదు తన చెల్లెళ్ళకి కూడా మూడేసి వందల చొప్పున ఇస్తాడు. ఆయన ఇవ్వడం, వాళ్ళు తీసుకోవడం అనేది ఒక అలవాటుగా మారిపోయింది. దాన్ని బ్రేక్ చేయడం ఎవరికీ ఇష్టం లేదు.

❁ ❁ ❁

అమ్మాజికి కోపం వచ్చింది.

అటు అన్నయ్యగాని ఇటు అక్కయ్యగాని ఏ ఒక్కరూ తనతో సహకరించలేదు.

యల్.టి.సి.పై ఢిల్లీ, ఆగ్రా, హరిద్వార్ వగైరా ప్రదేశాలకు సరదాగా వెళ్దామనుకున్న ఆమెకు రమణయ్య ఆటంకమయ్యేడు. అది పదిహేను రోజుల ప్రోగ్రాం. తాము ఉత్తర భారత తీర్థయాత్రల నుంచి తిరిగి వచ్చే వరకు తండ్రిని తమ వద్ద వుంచుకొమ్మని అన్నయ్యని, అక్కయ్యని ప్రార్థించింది – ఫోన్ చేసి.

"నా ఆరోగ్యం బాగోలేదు చెల్లీ! నాన్నను చూసుకునే పరిస్థితిలో లేను. అన్నయ్య దగ్గర వుంచు" అన్నది లలిత. అన్నయ్యను అడిగితే తను కూడా అదే సమయంలో ఫేమిలీతో దక్షిణదేశ తీర్థయాత్రలకి వెళ్తున్నాను. అంచేత ఏమీ అనుకోవద్దు అని ఫోన్ పెట్టేశాడు.

కుతకుతలాడిపోయింది అమ్మాజి.

తను సరదాగా టూర్ వెళ్ళడం చూడలేక ఉడుకుమోత్తనంతో కావాలనే వాళ్ళు సహకరించలేదని ఆమె భావించింది. ఒళ్ళు మంటతో వాళ్ళని తిట్టరాని తిట్లు తండ్రి ముందే తీవ్రస్థాయిలో తిట్టింది.

"పదిహేను రోజులే కదమ్మా! నేను ఒక్కణ్ణి ఇంట్లో వుండగలను. నా గురించి ఆలోచించకుండా మీరంతా హేపీగా వెళ్ళిరండి" అని రమణయ్య అనడంతో అమ్మాజి శాంతించింది.

ఢిల్లీ, ఆగ్రా, హరిద్వార్ వగైరా ప్రదేశాలన్నీ అనుకున్న టైముకి హేపీగా వెళ్ళి తిరిగి వచ్చేశారు అమ్మాజి, సూర్యం మరియు పిల్లలు.

సూర్యంకి టూర్ నుంచి వచ్చేశాక బుర్ర పనిచేసినట్టుంది –

"మీ నాన్నని అక్కడా ఇక్కడా వుంచే ప్రయత్నం చేశాంగాని ఆయన్ని మనతో బాటే

తీర్థయాత్రలకు తీసుకుపోవాల్సింది! మనకా ఆలోచన ఎందుకు రాలేదు? మనతో బాటు వుంటున్న కుటుంబ సభ్యుణ్ణి నిర్దాక్షిణ్యంగా వదిలేసి ఎలా వెళ్లగలిగేం" - గిల్టీ ఫీలయ్యేడు సూర్యం.

"అవునండి. మీరన్నది రయిటే. నా పాడు బుర్రకి తోచలేదు. నాన్నను మనతో తీసుకువెళ్ళకపోవడం తప్పే" అని అమ్మాజి అంటుందని ఆశించేడు సూర్యం.

కాని ఇదే అదనుగా, అసందర్భంగా తీవ్రస్థాయిలో మళ్ళీ ప్రకాష్‌పై, లలితపై తిట్ల పురాణం ఎత్తుకుంది.

ఆమె చక్కనయిన ముఖం ఒక్కసారిగా అష్టవంకర్లు తిరిగిపోయి వికృతంగా మారిపోవడంతో అక్కడ నుంచి తటాలున లేచి వెళ్ళిపోయేడు సూర్యం - ఆ ముఖాన్ని చూడలేక.

❀ ❀ ❀

రమణయ్య వయసులో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.. అతనికిపుడు ఎనభై ఏళ్ళు! ఇంతకు ముందులా ఒంటరిగా రోడ్డు ఎక్కాలంటే ధైర్యం చాలడం లేదు. కాస్త దూరం నడిస్తే నడుం లాగుతోంది. కాళ్ళు పీకుతున్నాయి. అంచేత ఇంతకు మునుపు తను ఏమీ కాకుండా నడిచి వెళ్ళిపోయిన చోటుకి ఇపుడు ఆటోని ఆశ్రయిస్తున్నాడు. ఎదిగిన మనవడు, మనవరాలు తనకు తోడుగా వస్తున్నారు అప్పుడప్పుడు.

అదికూడా బ్రతిమాలితేనే వస్తున్నారు పిల్లలు! వాళ్ళకిపుడు తాతయ్య స్థానాన్ని కంప్యూటర్ ఆక్రమించేసింది. వాళ్ళనిపుడు ఉరకలు వేయిస్తున్నది, ఉత్సాహపరుస్తున్నదీ తాతయ్య కథలు, కబుర్లు కావు. కార్టూన్ ఫిలిమ్స్. వీడియో గేమ్స్!

పిల్లలు తన నుంచి ఎడం అవుతున్నారా?

అమ్మాజిలో కూడా ఏదో మార్పు!

ఎప్పుడూ చిరాకుగా, కోపంగా వుంటోంది. ఒకొక్కసారి ఆమెలో అసహనం అవధులు దాటుతోంది.

ఒకరోజు తన వద్దకు వచ్చి "నాన్నా! మీరిక చుట్టలు తాగడం మానేయాలి" అంది. ఒకరకంగా ఆదేశించింది అనాలి.

నివ్వెరపోయాడు రమణయ్య!

తండ్రి ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని ఇచ్చిన సలహా కాదు. ఇంట్లో పిల్లల ముందు, ఇంటికి వచ్చీపోయే స్నేహితుల ముందు ఆయన చుట్ట తాగడం ఆమెకు చికాకు కలిగిస్తోంది.

రమణయ్యకి చుట్ట పద్దెనిమిదేళ్ళ వయసప్పుడే అలవాటయింది. చుట్ట తాగడానికి వీల్లేదని ఆయన్ని ఇంతవరకూ ఎవరూ శాసించలేదు. చివరికి అతని తండ్రి కూడా. ఇపుడు కూతురు ఆదేశిస్తోంది. ఆ కూతురే తనకిష్టమైన బ్రాండ్ పొగాకు గుర్తు పెట్టుకుని కొని తేవడం, చుట్టలు చుట్టడం, నిప్పు వెలిగించడం చేసేది. ఇపుడు ఆమెకు చికాకు కలిగిస్తున్నాయి ఆ

చుట్టలు!

అమ్మాజి తనని చుట్ట తాగడం మానేయమనగానే.. రమణయ్య నవ్వుతూనే, "అది నా ఊపిరి తల్లీ" అని స్పష్టం చేశాడు. అంతకన్న ఎక్కువ మాటాడలేదు.

"మీ ఇష్టం" అని ముఖం చిట్లించుకొని చరచరా వెళ్ళిపోయింది అమ్మాజి.

అవును. పిల్లల ఎదుట కాకుండా అతని గదిలో ఏకాంతంగా చుట్టలు తాగవచ్చు. కాని ఆ అవకాశం ఏది?

అతని గది అతను చూస్తుండగనే పిల్లల గదిగా మారిపోయింది!

రెండు గదుల ఇల్లు అది. ఒక గదిలో సూర్యం, అమ్మాజి పడుకుంటారు. మరో గది రమణయ్యది. ఇప్పుడది పిల్లల గదిగా రూపాంతరం చెందింది. రమణయ్య పడుకునే పందిరి కోళ్ళ మంచం మాయమై ఆ స్థానంలో ఆధునికమైన డబుల్‌కాట్ మంచం ప్రత్యక్షమైంది. ఆ మంచంపై పిల్లలతో బాటు తనూ పడుకోవాలి! పిల్లల పుస్తకాల షెల్ఫ్‌తో, హోమ్‌వర్క్ చేసుకునే టేబుల్, కుర్చీలు, కంప్యూటర్, దానికో టేబుల్ – ఇలా గదంతా చిందర వందరగా, ఇరుకిరుకుగా పిల్లల సామాను, బట్టలతోనే నిండిపోయింది.

ఆ గదే కాదు, వంట గది బాత్రూమ్‌లతో సహా ఏదీ ఆ యింట్లో అమ్మాజికి నచ్చడం లేదు. ఇంట్లోకి అవసరమయ్యేవి, అందంగా అలంకరింపబడేవి ...ఎన్నో ఎన్నెన్నో వస్తువులు కొంటోంది. కాని ఏం సుఖం? ఇల్లు చాలక, అవన్నీ ఎలా సర్దుకోవాలో అర్థంకాక చికాకు పడిపోతోంది. ఇదేం ఇల్లు?

ఇల్లంటే ఎలా వుండాలో ఆమెకు కొన్ని రంగుల ఊహలున్నాయి. మరో ఆరు నెలల్లో ఆమె స్వప్నం సాకారమవబోతోంది. గ్రూప్ హౌసింగ్ స్కీంలో టూ బెడ్‌రూమ్ హౌస్ ఒకటి బుక్ చేసి తనకు నచ్చిన రీతిలో కట్టుకుంటోంది.

ఉద్యోగపు ఒత్తిడి అమ్మాజీపై ఎంత వున్నప్పటికీ రోజూ కొంత సమయం తను కట్టుకుంటున్న ఇంటిపై స్పేర్ చేయకుండా వుండలేని పరిస్థితి. సూర్యం తనంత ఉత్సాహం చూపి ముందుకు రావడం లేదు. మొక్కుబడిగా ఆమె చెప్పిన పనులేవో చేస్తున్నాడు. బడ్జెట్‌ను మించి అప్పులతో, లోనులతో లేనిపోని ఆడంబరాలకు, షోకు డిజైన్‌లకు పోయి డబ్బు తగలెయ్యడం అతనికి నచ్చలేదు. సింపుల్‌గా కట్టుకుందామన్న అతని ఆలోచన ఆమెకు నచ్చలేదు.

"మనం కట్టుకుంటున్నది ఒక్కగానొక్క ఇల్లు! మీరు అనవసరంగా అభ్యంతరాలు లేవదీసి అడ్డుపుల్లలు వేయకండి. నాకు నచ్చిన రీతిలో కాస్త అందంగా కట్టుకోనివ్వండి ప్లీజ్" అంది. సూర్యం అడ్డు చెప్పలేదిక! అతడు ఉత్సాహం చూపించడం తగ్గడంతో మొత్తం భారమంతా ఆమె పైనే పడింది. కాదు నెత్తి మీద వేసుకుంది.

ఇంటి చాకిరి ఆమెకు ఎలానూ వుంది. రోజూ ఉదయం లేచినప్పటినుంచి డ్యూటీ కెళ్ళేవరకు, డ్యూటీ నుంచి ఇంటికొచ్చేక..పక్క మీద పడుకునేవరకు ఇంటి చాకిరీ తనకు

తప్పదుగాక తప్పదు.

నడుం వాల్చేక నిద్ర పోకపోతే ఎట్లా? నిద్ర పట్టకపోతే వేరు. పడుతున్న నిద్రని, బంగారం లాంటి నిద్రని చెడగొడితే ఎట్లా? ఒళ్లు మండిపోదూ!

ఆ రోజు... ఆమె బంగారం లాంటి నిద్రని చెడగొట్టింది పిల్లలు కాదు. రమణయ్య రాత్రంతా దగ్గుతూనే వున్నాడు. అమ్మాజికి నిద్ర పట్టక మంచంపై అటూ ఇటూ దొర్లింది. అతని దగ్గు గది గోడల్లోంచి, మూసిన తలుపుల్లోనించి దూసుకుపోయి అమ్మాజి ప్రాణాలను తోడుకు తినేసింది.

సుళ్ళు తిరిగిపోతూ భీకరమైన ఒక దగ్గు తెర ఆమెను తట్టి లేపడంతో మంచంపై నుంచి సర్రున లేచింది. ఒకానొక క్రూరమైన క్రోధావేశం ఆమెలో తాటాకు మంటలా లేచి తలుపులు తోసుకొని తండ్రిపై పిడుగులా పడింది.

"పెంకులెగిరిపోయేలా ఏమిటా ముష్టి దగ్గు? మమ్మల్ని నిద్ర పోనివ్వరా? ఏమైంది మీకు? చుట్టలు మానేయమని నెత్తీనోరు బాదుకున్నాను. అది నా ఊపిరమ్మా అని రాగాలు తీశారు. ఇపుడా దెప్ప చుట్టలు మీ ఊపిరితిత్తుల్ని తినేయడం కాదు మాకు ఊపిరాడనీయకుండా నిద్రాభంగం చేస్తోంది. ఉద్యోగాలు చేసొచ్చే మాకు ఏమిటీ శిక్ష చెప్పండి కాసేపు నిద్ర పోనివ్వరా?" అని పెనుకేకలు వేసింది అమ్మాజి.

రమణయ్య మాటాడే స్థితిలో లేడు – దగ్గడం తప్ప.

అమ్మాజి కేకలకి సూర్యం లేచివచ్చి ఆమెపై విరుచుకుపడ్డాడు – "నీకేమైనా మతిపోయిందా? నీ నిద్ర చెడగొట్టాలని ఒక పనిగా పెట్టుకుని మీ నాన్న దగ్గుతున్నాడం టవా? నీ కసలు బుద్ధీ బుర్రా లేదు. రోజు రోజుకీ సెన్స్‌లెస్‌గా, రాక్షసిలా బిహేవ్ చేస్తున్నావు" అని అంటూ –

సూర్యం రమణయ్య వద్ద కొచ్చి, తాగడానికి మంచినీళ్ళిచ్చి అతన్ని తాకి చూస్తే – అగ్గిలా కాలిపోతోంది ఒళ్ళు!

రమణయ్యకు ఆ రాత్రి భోజనం సయించలేదు. ఆ రోజంతా నలతగా, నీరసంగా వుండడం తెలుస్తోంది కాని.. ఇలా పెనుజ్వరంగా మారి దగ్గు తెరలతో గొంతు నొక్కేసి ఇంతగా ఉక్కిరిబిక్కిరి చేసేస్తుందనుకోలేదు.

తండ్రికి జ్వరం అనడంతో అమ్మాజి చల్లబడిపోయింది. ఇంట్లో స్టాక్ వున్న మాత్రలు వెదికి తండ్రికి వేసింది. ఉదయం డాక్టరు వద్దకు వెళ్దామంది. దగ్గు సెన్సేషన్ రాకుండా లవంగం నోట్లో పెట్టుకోమని ఇచ్చింది. చాలసేపు తండ్రి వద్ద కూర్చొని తడి గుడ్డతో ఒళ్ళంతా రుద్దుతూ ఏడ్చేసింది. బుద్ధి లేకుండా తను వేసిన కేకలకు క్షమించమని వేడుకుంది.

ఉన్మాదిలా ప్రవర్తించడం ఎందుకు? తర్వాత దుఃఖించడం ఎందుకు? సూర్యంకి ఎపుడో పేపర్లో చదివిన వార్త గుర్తుకొచ్చింది? తండ్రి కిలాగే విడవని దగ్గు తెరవస్తే అతని కుమారుడు సహనం కోల్పోయి తండ్రిపై తిట్ల పురాణం అందుకున్నాడు. తండ్రి అంతకన్నా అసహనంతో

కొడుకుని రైఫిల్‌తో కాల్చేశాడు. అతడు రిటైర్డ్ మిలటరీ ఆఫీసర్.

రమణయ్య వద్ద రైఫిల్ వుంటే కూతుర్ని కాల్చేసేవాడా? కాల్చడమా? ఆయన ముఖంలో కోపరేఖలే కానరావు!

మరుచటి రోజు ఉదయం మంచంపై నుంచి నెమ్మదిగా లేచేడు రమణయ్య. ఒళ్ళంతా నిస్సత్తువగా, నీరసంగా వుంది. డాక్టరు వద్దకు వెళ్ళక తప్పదని తెలుస్తోంది. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ గోడ పట్టుకుని బాత్రూమ్‌కి వెళ్ళగలిగేడు. మూత్ర విసర్జన చేయబోతూ దబ్బున పడిపోయేడు. అతని తల గోడకి గట్టిగా తగిలింది. రక్తం చిందింది. అక్కడే అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయేడు రమణయ్య.

గొల్లుమంది అమ్మాజి. 'తాతయ్యా' అంటూ బావురుమన్నారు మనవడు, మనవరాలు.

రమణయ్యను కార్పొరేట్ ఆసుపత్రిలో జాయిన్ చేశాడు సూర్యం.

నలభై ఎనిమిది గంటల్లోగా ఏమీ చెప్పలేమన్నారు డాక్టర్లు. తను ఎనభయ్యేళ్ళ వృద్ధుడు గనుక బతికి బట్టకడతాడనే నమ్మకం లేదని సూచనప్రాయంగా తెలియజేశారు.

అమ్మాజి దుఃఖం దిగమింగుకొని అన్నయ్యకి, అక్కయ్యకి, బంధువులందరికీ ఫోన్లు చేసింది.

కడచూపు అయినా దక్కుతుందో లేదోనని ఎవరికి వాళ్ళు వున్నపాటున బయల్దేరి వచ్చేశారు. అందరివాడు రమణయ్య. ఆయన విగతజీవి అయితే ఆప్యాయత నిండిన తీయని పలకరింపులేక ఎండిన మొక్కల్లా తల్లడిల్లిపోతారు వాళ్ళు. నీడనిచ్చే వటవృక్షం కూలిపోతుందా? నలభై ఎనిమిది గంటలకు ముందే స్పృహలోకి వచ్చేశాడు రమణయ్య.

ఆయన కళ్ళు తెరచి చూడగానే.. ఎదురుగా కొడుకు, కోడలు, కూతుళ్ళు, అల్లుళ్ళు, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు తదితర బంధువులు... తన వాళ్ళను చూస్తుంటే వాళ్ళ కోసం మరో వందేళ్ళు బతకాలనే బలమైన కోరిక కలిగింది. బంధుజనం పలకరింపుల ప్రాణవాయువుకి అతని గుండె తృప్తిగా స్పందించింది.

'వీళ్లంతా పదేళ్ళ క్రితం సుందరమ్మ పోయినప్పుడొచ్చేరు. ఈ రోజు నేను పోతున్నానుకొని వచ్చేరు. వీళ్ళ కోసం తను ఆగేడు. లేకుంటే సుందరమ్మ చెంతకు ఈ జీవి పయనించడానికి సిద్ధపడేదేమో' – తనలో తాను నవ్వుకున్నాడు రమణయ్య.

తండ్రినొక పక్క వచ్చీపోయే బంధువులనొకపక్క చూసుకోలేక పిచ్చెక్కినట్టయిపోయింది అమ్మాజి. వారం పది రోజులు ఆఫీసుకి సెలవు పెట్టేయక తప్పలేదు.

చుట్టం చూపులా అక్కా, బావ రెండు రోజులుండి వెళ్ళిపోయేరు. అన్నయ్య, వదినా అలాగే వెళ్ళిపోయేరు. వెళ్ళేముందు అన్నయ్య పదిహేను వేలు డబ్బు ఇవ్వబోయేడు. తీసుకోలేదు తండ్రి. తన దగ్గర ప్రస్తుతం డబ్బులున్నాయని అవసరమైతే అడిగి తీసుకుంటానని అన్నాడు.

ప్రకాష్ నుంచి డబ్బులు తీసుకోకపోవడం అమ్మాజికి సంతోషం కలగజేసింది. 'తండ్రిని

తమ వద్ద రెండు రోజులు వుంచుకోలేని వాళ్ళ నుంచి డబ్బు మాత్రం ఎందుకు తీసుకోవాలి? ఎవరిక్కావాలి ముష్టి? ఆ మాత్రం తను పెట్టలేదా?' – అనుకుంది అమ్మాజి కోపంగా.

తర్వాత మేనత్తలతో, చిన్నాన్నలతో తన గోడు చెప్పుకుని ఏడ్చింది.

అక్క అన్నయ్య నాన్నని పూర్తిగా పట్టించుకోవడం మానేశారని, ఇదిగో ఇలా చుట్టం చూపులా ఆయన్ని చూసి వెళ్ళిపోతున్నారనీ, రెండు రోజులు తమ వద్ద వుంచుకోవడానికి ముందుకు రావడం లేదనీ, తనొకసారి ప్రాధేయపడినా కుదరదని ముఖం మీద కొట్టినట్టు చెప్పేశారని ఇంకా ఏవేవో చెప్పుకొని ఏడ్చింది.

సానుభూతి పొందడానికి వంద మాటలు అల్లిక చేయలేని పని అర లీటరు కన్నీరు చేస్తుందనే విషయం ఆమెకు తెలుసుననుకున్నాడు సూర్యం. ఇపుడామె ముఖంలో తనకు ఎలాంటి మెరుపులు, ఇంద్రధనస్సులూ కనిపించడంలేదు. ఆమెలో సహజ సౌందర్యమంతా అంతర్ధానమై రంగస్థలంపై రంగులు పులుముకున్న అసహజ ముఖం ప్రత్యక్షమయింది!

బంధువులు వెళ్ళిపోయేరు. మళ్లీ తెర లేచినప్పుడు ముఖానికి రంగు పులుముకుంటుందా?

ఆసుపత్రి నుంచి రమణయ్య ఇంటికి వచ్చేశాడు. బిల్లు ఇరవై వేలు అయింది. ముందుగా అమ్మాజీయే బిల్లు కట్టింది. తర్వాత రమణయ్య ఆమె చేతిలో పాతిక వేలు పెట్టేడు.

"బిల్లు ఇరవై వేలే అయింది నాన్నా"

"ఫర్లేదు వుంచమ్మా. మనవాళ్ళు ఎంతమందో వచ్చి వెళ్ళేరు. కనపడని ఖర్చు. అంతకు మించిన సేవ చేశావు. దాని దగ్గర ఈ డబ్బు విలువ ఎంతమ్మా" అన్న తండ్రి మాటలకు ఆమె కళ్ళు చెమర్చాయి. తండ్రి వైపు ప్రేమగా చూసింది.

ఆ పాతిక వేలతో అతని వద్ద నున్న ఫిక్స్‌డ్ డిపాజిట్లకు రెక్కలొచ్చి ఎగిరిపోయేయి నెలనెలా వచ్చే అయిదు వేల పెన్షను మాత్రమే వుంది.

తండ్రి తనకు డబ్బునిస్తే అది ఎంతో సమంజసంగా, న్యాయంగా కనిపిస్తుంది. అదే అవతల వాళ్ళకి ఆయన డబ్బిస్తే కస్సుబుస్సు మంటుంది అమ్మాజి.

"ఏమిటో ఈ మనిషి! తన వాళ్ళనుకున్న వాళ్ళ కంట్లో నలుసు పడితే చాలు ఈయనగారి గుండెల్లో గునపం గుచ్చుకుంటుంది. వెంటనే పదో పరకో పంపించేస్తాడు. పంపొద్దని ఎంత మొత్తుకున్నా ఆయన బుద్ధి మారదు" అని అమ్మాజి అంటే –

"బుద్ధిమారాల్సింది ఆయనక్కాదు. నీకు" అంటాడు సూర్యం. ఆత్మీయులతో ఆయనకున్న ప్రేమానుబంధాలను ప్రశ్నించే అధికారం నీకు లేదంటాడు.

ఇద్దరి మధ్య గొడవ.

బంధాలు, వాటి భావోద్వేగాలతో నిమిత్తం లేని యాంత్రిక జీవన ఒత్తిడిలో ఆమె నుంచి వినిపిస్తున్న ప్రేమరాహిత్యపు శబ్దాలు సూర్యాన్ని కలవరపెడుతున్నాయి.

తీరుతెన్ను లేని జీవితాలు! ఎదుటి వారికి ఏదైన మంచి చేయలేమా? చేయలేకపోతే

పోయే. చేసేవాళ్ళని కూడా చూసి భరించలేమా? స్వచ్ఛమైన మానవ బంధాలకి నాచు పడుతోందా - అని ఆందోళన చెందేడు సూర్యం.

❁ ❁ ❁

కట్టుకున్న కొత్త ఇల్లు అమ్మాజికి పూర్తిగా తృప్తి నిచ్చింది. విశాలమైన లివింగ్ రూమ్, దానికి ఆనుకుని కిచెన్ కమ్ డైనింగ్ రూమ్, టూ బెడ్‌రూమ్స్... ఇంటీరియర్ డెకరేషన్‌తో ఏ గదిని ఎలా సర్దాలో ముందుగానే నిర్ణయించేసుకుంది. సర్దుకోవాల్సిన వస్తువులన్నీ ఆమె వద్ద సిద్ధంగా వున్నాయి.

ముందుగా, ఘనంగా గృహప్రవేశం జరపాలి.

బంధుమిత్రులను యావత్తు పిలిచింది అమ్మాజి.

గృహప్రవేశ మహోత్సవం ముగిసేక బంధువుల మధ్య తండ్రి విషయం చర్చకు పెట్టాలని నిర్ణయించుకుంది. ఈసారి తాడో పేడో తేలిపోవాలి. తండ్రికి సేవ ఇన్నాళ్ళు తను చేసింది చాలు. ఇక అన్నయ్యో లేక అక్కయ్యో ఆయన్ని చూసుకోవడం ధర్మం. వాళ్ళ నక్క జిత్తులతో తప్పించుకోచూస్తే తను వూరుకోదుగాక వూరుకోదు. యుద్ధమైపోతోంది అనుకుంది.

వచ్చిన బంధువులందర్నీ చూడగానే ప్రాణం లేచివచ్చినట్టయింది రమణయ్యకి. తన వాళ్ళందర్నీ చూస్తుంటే కొండంత ధైర్యం, కోటి రూపాయల బ్యాంక్ బాలన్స్ వున్నంత ధీమా కలిగేయి అతనికి.

మొత్తం బంధువర్గం కదిలి రావడంతో.. మళ్ళీ ఇంతమందిని కలిసే అవకాశం రాదనుకున్నాడో ఏమో ఒక ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్‌ని పిలిపించేడు రమణయ్య - అక్కడ ఇద్దరు ముగ్గురు వద్ద కెమెరాలు వున్నప్పటికి!

సమస్త బంధుజనంతో ఒక గ్రూప్ ఫోటో దిగేడు.

కొడుకు, కోడలు, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనవలు, మనవరాళ్ళు, చెల్లెళ్ళు, తమ్ముళ్ళు, వాళ్ళ వాళ్ళ పిల్లలు, ఆ పిల్లల పిల్లలు... బంధువులే కాక మిత్రులు.. కొందరు నిలబడ్డారు. మరికొందరు కూర్చున్నారు. అందరి ముఖాలు పువ్వుల్లా వికసించి పసిపాపల్లా నవ్వుతుంటే మనుషుల మధ్య ప్రేమానురాగాలు ఇంకా ఇంకిపోలేదని తెలియజేసేందుకు సాక్షిగా నిలబడి క్లిక్ మంది కెమేరా.

సత్యనారాయణ వ్రతం, భోజనాలు ముగిసేక తను అనుకున్నట్టుగానే తండ్రి విషయం నలుగురి మధ్య లేవదీసింది అమ్మాజి.

ఆ విషయం అందరితో చెప్పింది గాని తండ్రితో ఒక మాటగానైన చెప్పలేదు. చెప్పాలని ఆమెకు తోచలేదు. అవసరం కూడా లేదు. ఇదంతా ఆ రోజు అతని చెల్లెలు చెవిలో వేయగా తెలుసుకొని అప్రతిభుడయ్యేడు రమణయ్య. సూర్యంకి కూడా ఈ విషయం ముందుగా చెప్పలేదు.

నలుగురి మధ్య తండ్రి విషయం చర్చకు లేవదీసి మాట్లాడుతున్నప్పుడు అమ్మాజి ముఖం

వంకరలు తిరిగిపోయి అసహ్యంగా ఒక సాలెగూడులా కనిపించింది సూర్యంకి.

ప్రకాష్ లేచి నిలబడ్డాడు.

"దీనికి చర్చ ఎందుకు? నాన్నని నా వద్దే వుంచుకుంటానని అమ్మ పోయినప్పుడే చెప్పాను. ఇప్పుడూ అదే చెబుతున్నాను" అన్నాడు.

మరిక సమస్య ఏముంది? అందరి ముఖాలు మెరిసేయి. అంతా సంతోషించేరు. అమ్మాజి గుండె చిక్కబడింది.

అయితే ప్రకాష్ వెంటనే, "కానీ...." అన్నాడు.

అందరూ అతని వైపు చూసేరు. మళ్ళీ కానీ ఏమిటంటూ!

"మరేం లేదు. నేను, మా ఆవిడ వచ్చే నెల అమెరికా వెళ్తున్నాం. మీకు తెలుసు కదా. మా పెద్దబ్బాయ్ రాజేష్ అక్కడ ఉద్యోగం చేస్తున్న విషయం. వాడు రమ్మని గొడవ పెడుతున్నాడు. ఈ ప్రోగ్రాం ఎప్పుడో ఫిక్స్ చేయబడింది. వీసాలు కూడా సిద్ధంగా వున్నాయి. అక్కడ నాలుగైదు నెలలు వుండాలనుకుంటున్నాం. అమెరికా నుంచి తిరిగి వచ్చిన వెంటనే నేనే వచ్చి తీసుకువెళతాను నాన్నని" అన్నాడు ప్రకాష్.

"దానికేముంది బాబూ. అలాగే కానీయ్. అంతవరకూ లలిత దగ్గర వుంటాడు అన్నయ్య.. పెద్ద కూతురు ముచ్చట కూడా తీరాలి కదా" అన్నాడు రమణయ్య పెద్ద తమ్ముడు నారాయణ పెద్దరికంతో.

ఆ నాలుగైదు నెలలు తండ్రిని తన వద్ద వుంచుకోవడానికి అంగీకరించింది లలిత.

అంతా హర్షించేరు.

అంతలో శంకర్రావు లేచి –

"క్షమించాలి. మావయ్యగారిని మా ఇంటికి తీసుకెళ్ళడానికి నేను ఒప్పుకోవడం లేదు. మరో విధంగా చెప్పాలంటే మా ఆవిడకి ఆమె తండ్రిని నా యింటికి తీసుకెళ్ళడానికి ఇంటి యజమానిగా ఆమెకు నేను అనుమతి ఇవ్వడం లేదు. ఆవిడికా హక్కు లేదు. నేను కాదంటున్నందుకు క్షమించండి. కారణాలు మాత్రం అడగొద్దు దయచేసి" అని అక్కడ నుంచి వెళ్ళిపోయేడు.

లలితకు తల కొట్టేసినట్టయింది. కాళ్ళ కింద భూమి కంపించినట్టుయింది. దుముకి వస్తున్న దుఃఖాన్ని దిగమింగే ప్రయత్నంగా పైట చెంగుని నోటి కడ్డం పెట్టుకుని – తన ముఖం ఎవరికీ చూపించలేక పరుగున లోన గదిలోకి వెళ్ళిపోయింది. ఇంతకంటే అవమానం, దయనీయమైన విషయం ఏ గృహిణికి ఉండదు కదా.

శంకర్రావు తమ్ముడు రామకృష్ణది వ్యవసాయం. తల్లి శాంతమ్మ కూడా తమ్ముడి వద్దే వుంటోంది. గత రెండు, మూడేళ్ళుగా కరువుతో ఇబ్బంది పడుతున్నాడు రామకృష్ణ. దానికి తోడు తల్లి అనారోగ్యంతో బాధపడుతోంది.

ఇబ్బందుల్లోనున్న తమ్ముడికి కొంత డబ్బిచ్చి, తల్లికి వైద్యం చేయిద్దామని తనతో బాటు

తీసుకొచ్చేడు ఇంటికి శంకర్రావు.

ఇంట్లో అడుగు పెట్టిన అత్తను చూసి భరించలేకపోయింది లలిత. కోపంతో, కసితో ఎవరికీ చెప్పా చేయకుండా ఉద్యోగం చేస్తున్న పెద్దకొడుకు దగ్గరికి బెంగుళూరు వెళ్ళిపోయింది. లలిత ఇంట్లో కనిపించకపోవడంతో హడలిచచ్చేడు శంకర్రావు. చివరికి కొడుకు నుంచి ఫోన్ వచ్చేక స్థిమితపడ్డాడు. కాని ఆమె ప్రవర్తన ఈనాటి వరకూ క్షమించలేకపోయాడు.

లలిత బెంగుళూరు వెళ్ళిపోవడంతో శంకర్రావు, అతని తల్లి చాలా ఇబ్బందులు పడ్డారు. ఇబ్బందులు పడాలనే వెళ్ళిపోయింది నిర్దాక్షిణ్యంగా లలిత. ఇంట్లో ఇక ఎవరూ లేరు. హోటల్ తిండి తింటూ తల్లిని ఆసుపత్రికి తిప్పేడు శంకర్రావు. కాని రెండు వారాలకే తల్లి చనిపోయింది.

తన మరణం తప్పా ఇంకేదీ కొడుకుని రక్షించలేదని, సమస్యను కడతేర్చలేదని, కోడలు తిరిగి వచ్చి కొడుకు సుఖపడాలంటే తను ప్రాణత్యాగం చేయడమే పరిష్కారంగా భావించి తల్లి చనిపోయిందని శంకర్రావు భావించేడు. తన తల్లి చచ్చిపోలేదు - లలితే కర్కశంగా, దుర్మార్గంగా చంపేసిందని నమ్ముతాడు.

'చిన్నినా బొజ్జకు శ్రీరామరక్ష' అని చిన్న గిరి గీసుకుని సంకుచితంగా, స్వార్థంగా ప్రవర్తించే లలితలో సేవాగుణం అణుమాత్రమైనా లేదని అతనికి అర్థమయింది. ఇంట్లో స్థానం తన తల్లికి లేనప్పుడు ఆమె తండ్రికెలా వుంటుందని, వుండడానికి వీలు లేదని కోపంతో శంకర్రావు ఆ విధంగా మాటాడలేదు. దయాగుణంలేని లలిత రమణయ్యకు న్యాయం చేయలేదని, సరిగా చూసుకోలేదనే ఉద్దేశ్యంతోనే ఆయన్ని తమ ఇంటికి తీసుకువెళ్ళడానికి ఒప్పుకోలేదు శంకర్రావు.

తర్వాత అమ్మాజి ముందుకొచ్చి సమస్యను ఒక్క కొలిక్కి తీసుకొచ్చింది.

"మరేం ఫర్వాలేదు. అన్నయ్య అమెరికా నుంచి వచ్చి నాన్నను తీసుకెళ్ళేవరకు నేను చూసుకుంటాను. నాన్నని పదేళ్ళుగా చూసుకున్నాను. మరో నాలుగైదు నెలలు చూసుకోలేనా" అన్నది.

"బాగుంది. అలాగే కానియ్యమ్మా" అన్నారు నలుగురు.

ఇదంతా రమణయ్య ముందే సాగింది. ఆయన ప్రమేయం లేకుండానే ఆయన భవిష్యత్తు ప్రణాళిక అక్కడ విరచించడమైపోయింది. అతని అంగీకారం ఎవరికీ అక్కరలేదు.

ఒక పొగమంచులా అతని హృదయాంతరాళంలో అవ్యక్తమైన వేదన చెలరేగింది.

అతనిలో అంతర్మథనం. తను కూడా అప్పుడే అక్కడే ఒక నిర్ణయం తీసేసుకున్నాడు. అది అక్కడ చెప్పవలసిన అవసరం కాని, అగత్యం కాని కన్పించలేదతనికి.

రమణయ్య నెమ్మదిగా లేచి గది లోపలికి వెళ్ళి లలితను దగ్గరకు తీసుకుని ఓదార్చేడు. లలిత బోరుమని ఏడుస్తూ తండ్రి కాళ్ళపై పడిపోయింది. గుండెలవిసేలా నిజంగానే ఏడ్చింది.

❁ ❁ ❁

తన జీవితానికే అందమైన అర్థాన్ని ప్రతిబింబించేలా దివ్యంగా, మనోహరంగా

చూడముచ్చటగా వుంది నూతన గృహం.

ముఖద్వారంలోకి అడుగుపెడుతుండగానే లివింగ్ రూమ్ అందాలు చూసి కళ్ళు చెదిరిపోతాయి. విశాలమైన అల్మారా, అందులో సుందరమైన బొమ్మలు, గోడపై నిలువెత్తు పెయింటింగ్‌లు, నేలపై కార్పెట్, సోఫా సెట్, దివాన్, టీవీ స్టాండ్, కిటికీలకి గ్రీన్ కలర్ కర్టెన్స్ – ఇంటీరియర్ డెకరేషన్‌తో ఆ యింటి అందాలు అద్భుతానందాన్ని కలుగచేస్తోంది అమ్మాజికి. అలాగే రెండు బెడ్‌రూమ్‌లు. తనది ఎలా వుండాలో, పిల్లల రూమ్ ఎలా వుండాలో చక్కటి పనితనంతో తన ఇంటినే ఒక మోడల్‌గా తీర్చిదిద్దింది. మిత్రులంతా చూసి మెచ్చుకుంటుంటే అమ్మాజి విజయగర్వంతో పులకరించి పరవశించి పోయింది.

కాని ఆమె అంతరాంతరాల్లో అడుగున ఏదో మూలన ఏదో చిన్న సూది గుచ్చుకున్నట్టు అశాంతి! అది రగిలి రగిలి మూడు నెలలయ్యేసరికి ఒక రాచపుండులా పెద్దదయి ఆమెను హింసించి మనశ్శాంతి లేకుండా చేసింది.

ఇంత అందమైన ఇంట్లో విలువైన ఫర్నీచర్, ఖరీదైన వస్తువుల్ని చూసి పొందుతున్న మానసికానందానికి ఏదో చెద పట్టేసినట్టుగా వుందామెకు.

మసిపట్టిన అద్దంలా అయిపోయింది ఆమె ముఖం.

అందమైన కొత్త ఇంట్లో తనని తాను బంధించేసుకున్నట్టుగా వుందామెకు. ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయిపోతోంది. ఆమెకు భోరున ఏడ్వాలనిపిస్తోంది.

ఒంటరిగా గదిలో ఏడుస్తోంది.

నూతన గృహంలో రమణయ్య లేనందుకు సంతోషించవలసింది పోయి ఏడుస్తోంది అమ్మాజి!

మరోవైపు తాతయ్య కావాలని రోజూ ఏడుస్తున్నారు సుందరమ్మ, సందీప్‌లు.

"నీ తండ్రి వెళ్ళిపోవడం వెనుక నీ తప్పిదం వుంది. నీకు వస్తుపరమైన ఆనందం కావాలి. వ్యక్తిపరమైన తృప్తి కావాలి. సుఖం కావాలి. వాటి కోసం విలువలను ధ్వంసం చేసి మనుషుల్ని, ఆత్మీయుల్ని దూరం చేసుకున్నావు. బంగారం లాంటి తండ్రిని వదలుకున్నావు. నీవు చేసిన దానికి జీవితానికి సరిపడ చిత్తక్షోభ అనుభవిస్తావు" అని శపించేడు సూర్యం.

రమణయ్య వెళ్ళిపోయేడు. ఎవరికీ చెప్పాచేయకుండా వెళ్ళిపోయేడు. ఓల్డేజ్ హోమ్‌కి వెళిపోయేడు. ఆ విషయం అతను అక్కడ నుంచి ఫోన్ చేసి చెప్పేవరకు ఎవరికీ తెలీదు. అమ్మాజి కప్పుడు కోపం, దుఃఖం తన్నుకొచ్చేయి. తండ్రి చేసిన పని, ప్రవర్తించిన తీరు ఆమెకు నచ్చలేదు. ఒక విధంగా చూస్తే ఇది తన మంచికే జరిగిందేమోనని తలపోసింది. నూతనోత్సాహంతో నూతన గృహానికి మారింది.

కాని తండ్రి ఆమెకు గుర్తురాని రోజు లేదు. తన విశాలమైన వ్యక్తిత్వంతో, ఉదాత్తమైన ప్రవర్తనతో, నిష్కల్మషమైన నవ్వుతో గుర్తుకు వచ్చి కలత రేపుతూనే వున్నాడు.

కొత్త ఇంట్లో కుప్పలు తెప్పలుగా చొచ్చుకొచ్చిన అందమైన, విలువైన గృహోపకరణ

వస్తువుల వెల్లువలో... తండ్రి బయటకు నెట్టివేయబడ్డాడా? అసలు కనబడలేదా?

ఇదేమిటి? తనెంతో ఇష్టపడి కొనుక్కున్న ఈ విలువైన సుందరమైన వస్తు సముదాయమంతా తనకేమాత్రం ఆనందాన్ని కలిగించలేకపోతున్నదేమిటి? బ్యూటిఫుల్ ఇంటీరియర్ డెకరేషన్‌తో ఇల్లు నిండుగా, చక్కగా వుందని చూసిన వాళ్ళందరూ కొనియాడుతుంటే... తనకు యిల్లు బోసిపోయినట్టు నిస్తేజంగా కన్పిస్తున్నదేమిటి?

అమ్మాజికి దుఃఖం ఉప్పెనగా వస్తోంది.

అటు పిల్లలు, ఇటు సూర్యమే కాదు. తను కూడా రమణయ్య లేకుండా ఆ ఇంట్లో వుండగలగడం అసాధ్యమని ఆమెకు స్పష్టమయింది.

ఆఫీసుకి సెలవు పెట్టి తండ్రిని తీసుకొచ్చేయడానికి ఓల్డేజ్ హోమ్‌కి బయల్దేరింది అమ్మాజి. తనతో బాటు సూర్యాన్ని కూడా రమ్మని కోరింది. సూర్యం ఆమె వైపు సీరియస్‌గా చూసి రాను పొమ్మని చెప్పేశాడు.

ఒంటరిగా వెళ్ళక తప్పలేదు ఆమెకి. పిల్లలను తనతో బాటు కావాలనే తీసుకువెళ్ళలేదు. పిల్లల కోసమైనా తండ్రి, తనతో వచ్చేస్తాడని అమ్మాజి ఆశ.

❁ ❁ ❁

వృద్ధాశ్రమం నగరానికి దూరంగా పచ్చదనంతో కళకళలాడుతూ ఒక పర్ణశాలలా గోచరించింది అమ్మాజికి.

విజిటర్స్ వెయిటింగ్ హాలులో గోడపై నల్లటి అక్షరాలు కన్పించేయి.

'వృద్ధులను ఒక బరువుగా భావిస్తే అది కృతఘ్నుతకి గుర్తు'

అది చదివి 'అవును నేను కృతఘ్నురాలినే' అనుకుంది అమ్మాజి.

రమణయ్య ఏ గదిలో వుంటున్నది ఎంక్వయిరీ చేసి... అమ్మాజి అక్కడికి వెళ్ళేటప్పటికి తను మరో ఇద్దరు వృద్ధులతో హుషారుగా మాట్లాడుతున్నాడు. గృహప్రవేశం నాడు తీసుకున్న గ్రూప్ ఫొటోని వాళ్ళకి చూపించి ఒకొక్కరితో తనకున్న బంధాలు, బాంధవ్యాలు ఉత్సాహంగా వివరిస్తున్నాడు.

ఊహించని రీతిలో ఒక్కసారిగా కూతుర్ని చూడగానే రమణయ్య హృదయం రెక్కలు మొలిచిన రంగుల పిట్టలా సందడి చేసింది. తొలకరి జల్లుకి ఎండిన భూమిలోంచి చిమ్మే మనోహరమైన మట్టివాసనలా రమణయ్య మనసు మహదానందంతో పులకించి పోయింది. అమ్మాజిని తనివితీరా తన గుండెల కదుముకొని, "నా బంగారు కూతురు" అని గర్వంగా స్నేహితులకు పరిచయం చేశాడు.

తండ్రీ కూతుళ్లిద్దరినీ డిస్టర్బ్ చేయడం ఇష్టంలేక అతని మిత్రులు గది నుంచి బయటకు వెళ్లిపోయేరు.

తన బ్యాగ్‌లోంచి ఒక పుగాకు కట్ట తీసి ఇచ్చింది తండ్రికి అమ్మాజి. అది అతనికి ఎంతో ఇష్టమైన బ్రాండ్! 'అయ్యో! ఎందుకు తల్లీ!' అన్నాడు గాని అతని కళ్ళు మెరిసిన మాట

వాస్తవం. అమ్మాజి అది గమనించి అప్పటికప్పుడు పొగాకు రేకులతో చుట్టను చుట్టి తండ్రికి ఇచ్చింది. తనెదుట తాగేవరకు ఒప్పుకోలేదు. ఆయన తృప్తిగా పొగ పీలుస్తుంటే ఆమె తృప్తిగా చూసింది. ఆయనకు ఒకప్పటి అమ్మాజి గుర్తుకొచ్చేలా చేసింది.

రమణయ్య పిల్లల గురించి, అల్లుడి గురించి క్షేమ సమాచారాలు అడిగేడు.

అమ్మాజి తండ్రిని చుట్టేసుకుని చంటిపిల్లలా ఏడ్చింది.

"మీ కోసం పిల్లలు రోజూ ఏడుస్తున్నారు నాన్నా! మీరు వెళ్ళిపోవడానికి కారణం నేనే నని మీ అల్లుడు నన్ను తిడుతున్నాడు. ఆయన తిట్టడంలో తప్పేమీ లేదు. అంతా నాదే తప్పు. నన్ను క్షమించండి నాన్నా" అని ఏడ్చింది. ఇంటికి వచ్చేయమని పదే పదే కోరింది. "మీరెప్పుడూ మాతోనే వుండాలి. రేపు అన్నయ్య వచ్చినా, అన్నయ్యతో మీరు వెళ్ళడానికి నేనొప్పుకోను. మీరు లేకుండా నేనూ, సూర్యం, పిల్లలు వుండలేం. దయచేసి నా మాట కాదనకండి. పదండి వెళ్ళిపోదాం" అని బ్రతిమాలింది... ప్రాధేయపడింది.

ఆమె కంఠం నుంచి తొణికిన బాధకి, దుఃఖానికి రమణయ్య చలించలేదు. తనని తాను అదుపు చేసుకొని నిండుకుండలా గంభీరవదనంతో ఆమెను ఓదార్చే ప్రయత్నం చేశాడు.

"చూడు తల్లీ! నేను ఇక్కడికి ఎవరిపైనా కోపంతో రాలేదు. పూర్తిగా నా యిష్టంతోనే వచ్చాను. నాకు ఇక్కడ చాలా బాగుందమ్మా. ఇది నిజంగా ఒక ఆధునిక ప్రస్థానం. ఇక్కడున్న వాళ్లలో చాలామంది తమ పిల్లలతో గొడవలు పడి వచ్చిన వాళ్ళు కాదు. స్వచ్ఛందంగా వచ్చిన వాళ్ళు. వాళ్ళ పిల్లలు ఇక్కడికి ప్రేమతో వచ్చిపోతూనే వున్నారు. రాలేని పక్షంలో ఫోనులో ఆప్యాయంగా పలకరిస్తునే వున్నారు. నాకు ఇక్కడ చాల ప్రశాంతంగా, హాయిగా వుందమ్మా. నీ వనుకుంటున్నట్టు నేనేమీ ఒంటరిగా లేనమ్మా. ఇక్కడ యాభై మంది మిత్రులున్నారు" అంటూ గ్రూప్ ఫొటో తీసి చూసించి – "చూడు మిత్రులతో బాటు మన బంధువులు సమస్తం నాతోనే వున్నారు. మీరంతా వుండగా నాకేమి భయం చెప్పు. మీరంతా బాగుండండి. భగవంతుణ్ణి నేను ప్రార్థించేది అదే – అమ్మా! నీవు అప్పుడప్పుడు పిల్లలతో, అల్లుడితో వస్తుండు. నా కది చాలు" అని విశాలంగా విప్పారిన మనసుతో కల్మషం లేకుండా మాటాడిన తండ్రి ముందు తల ఎత్తి నోరు విప్పలేకపోయింది.

కన్నీళ్ళు తుడుచుకుని, మొద్దుబారిన మస్తిష్కంతో "వస్తాను నాన్నా" అని బయల్దేరింది అమ్మాజి.

"అమ్మా! ఒక్క నిముషం" అంటూ బీరువా తెరిచి ఒక్క ప్యాకెట్ తీసి అమ్మాజి చేతిలో ప్రేమగా పెట్టేడు.

అవి అరిసెలు!

"ఉదయం పెన్షన్‌కి వెళ్ళేటప్పుడు కొని తెచ్చేనమ్మా. తెచ్చిన రోజునే నీవు వచ్చేవు! నాకు చాలా సంతోషంగా వుందమ్మా" అన్నాడు నవ్వుతూ రమణయ్య.

అమ్మాజికి ఏడుపొస్తోంది.